

# సిరి-శాంతి

కొడవటిగంటిలో గొల్ల సిద్ధయ్య రాత్రంతా పొలానికి కాపలా కాసి తెల తెలవారుతుండగా ఇంటికెళ్దామని ఒక్కసారి పొలమంతా పారచూస్తే చేను మధ్యనేదో తళుక్కుమంది.

కళ్ళు నులుముకొని మళ్ళీ చూశాడు సిద్ధయ్య. మళ్ళీ తళుక్కు మంది. అది మెరుస్తున్న రాయి. పరుగునవెళ్ళి చేతిలోకి తీసుకున్నాడు. బరువుగా ఉంది. తెల్లవారి సూర్యకిరణాలు మీదపడ్తుంటే మరింత మెరుస్తోంది. ఆ మెరుపురాయిని ఏం చేయాలో సిద్ధయ్యకి తెలియలేదు. ఎలాగూ చద్ది తిని అమరావతి వెళ్తున్నాగదా అక్కడ ఎవరికన్నా ఇచ్చేద్దాం అనుకున్నాడు. మొల్లో

దోపుకుంటే నడుం పడిపోయేంత బరువుగా ఉంది.

అది అరవై ఆరు కారెట్ల వజ్రం.

అమరావతిలో పనిచూసుకుని అలసిపోయి వజనేపల్లి ముత్యాలు ఇంటిముందు అరుగుమీద కూర్చుని ఉస్సురంటూ స్తంభానికానుకుని రొంటి నున్న బరువుతీసి పక్కన పెట్టి విశ్రాంతి తీసుకుంటున్నాడు సిద్ధయ్య. రత్న వర్తకుడైన ముత్యాలు అప్పుడే ఇంట్లోంచి బయటికొస్తూ సిద్ధయ్యని, పక్కనున్న వజ్రాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. వజ్రం మీదే కళ్ళు నిలిపి బిత్తరపోతున్న ముత్యాలుని చూసి సిద్ధయ్య కంగారుగాలేచి 'అయ్యగారూ ఈ రాయి కావాలేంటండీ' అన్నాడు.

'ఎంతకిస్తావ్?' అన్నాడు ముత్యాలు.

రాళ్ళు కొనుక్కుంటాడేటీ పిచ్చి మాలోకం అనుకుంటూ ' ఓ పొగాక్కాడ ఇవ్వండి రాయి ఇచ్చేస్తా' అన్నాడు సిద్ధయ్య.

ఒకటేవిటి పట్టెడు పొగాకు చేతిలో పెట్టి రాయందుకున్నాడు. పదిరోజులకి సరిపడ పొగాకు దొరికినందుకు పొంగిపోతూ కొడవటిగంటి వైపు నడిచాడు సిద్ధయ్య.

ముత్యాలు ఆ వజ్రానికి మెరుగుపెట్టి చూశాడు. సూర్యబింబంలా వెలిగిపోతోంది. అంత బరువైన, విలువైన వజ్రాన్ని తానింతవరకు చూడలేదు. తోటి వర్తకులకు చూపించాడు. అందరూ ముక్కున వేలేసుకున్నారు. రాజాధిరాజుల దగ్గర ఉండవలసిన రత్నం నీకెలా వచ్చిందని అడిగారు. నవ్వి వూరుకున్నాడు ముత్యాలు.

ఈ వార్త ఆనోటా ఆనోటా పాకి వెంకటాద్రినాయుడి చెవిలో పడింది. ముత్యాలుని రప్పించాడు నాయుడు. 'రత్నహారాలు చేయిద్దామనుకుంటున్నాను. నీ దగ్గర జాతి రత్నాలేవయినా ఉంటే చూపించు అన్నాడు. ముత్యాలు తన దగ్గరున్న రత్నాలు, కెంపులు అన్నీ పరిచాడు. నాయుడికి తృప్తి కలగలేదు. ఇంకా గొప్పజాతి రత్నాలు లేవా? అన్నాడు. ముత్యాలుకి నాయుడు మనస్సు తెలిసింది. ఒక్కక్షణంలో తిరిగొస్తా అని ఇంటికెళ్ళి సిద్ధయ్య

ఇచ్చిన వజ్రాన్ని తీసుకొచ్చాడు.

సభలో అందరూ చూస్తుండగా పెట్టె తెరిచాడు. అందరి కళ్ళు జిగేలుమన్నాయి. సభ అంతా వెలిగిపోతోంది. దేవతామణి ఆకాశంనుంచి రాలినట్లుంది. కొంతసేపటికి అందరూ తేరుకున్నారు. "దీన్ని ముందే మాకెందుకు చూపించలేదు?" అన్నాడు నాయుడు.

నాయుడికి కోపం వచ్చిందని తెలిసింది ముత్యాలుకి. 'దీనికి తగిన వెల ఇవ్వలేమనే కదా మాకు చూపించలేదు?' అన్న భావం ఉంది ఆ ప్రశ్నలో. ముత్యాలుకి ఎటూ తోచక "ప్రభువులు గ్రహించాలి. ఇది అపురూప వజ్రమని తమకు తెలిసిందే. ముచ్చటపడి నేనే ఉంచుకుందామనుకుని ....." నసిగాడు ముత్యాలు.

నాయుడి ముఖంమీద బొమ్మ ముడి విడలేదు. "అయితే ఇప్పుడు ఎందుకు చూపించినట్లు?"

"తమ మనసు తెలుసు కనుక" అన్నాడు ముత్యాలు.

"మా మనసు మీరు ఆలస్యంగా గ్రహించారు. సరే వెల నిర్ణయించండి" అన్నాడు నాయుడు.

"మీరు రత్న పరీక్షలో నిపుణులు. మీకు వెల నిర్ణయించి చెప్పే వాణ్ణా?" అన్నాడు ముత్యాలు.

"సరే! ఈ రత్నం వెల పదిలక్షల రూపాయలు" అన్నాడు నాయుడు.

సభలో అంతా బిగుసుకు పోయారు. అనుకున్న దానికంటే కొంచెం ఎక్కువే అనుకున్నాడు ముత్యాలు.

నాయుడు మళ్ళీ గొంతు సవరించుకుని అన్నాడు. 'కాని ఈ వజ్రానికి పదిలక్షలేకాదు. ఇరవై లక్షలిస్తున్నాను మిగతా పదిలక్షలూ ఎందుకో తెలుసా? ఈ రత్నం ఎక్కడ దొరికిందో చెప్పాలి.'

ముత్యాలు నాయుడిముందు చేతులు జోడించి కొడవటిగంటి సిద్ధయ్య గురించి

చెప్పాడు. నాయుడు సభ చాలించి హుటాహుటిన హుకుంలు జారీచేశాడు. ఏనుగులు, గుర్రాలు, పల్లకీలు మందీ మార్బలంతో స్వయంగా కొడవటిగంటికి బయలుదేరాడు.

ముందుగా గుర్రాలమీద వెళ్ళినవాళ్ళు సిద్ధయ్య ఇల్లెక్కడో కనుక్కుని నాయుడుకి ఎదురు తీసుకొచ్చారు. సిద్ధయ్య వణికిపోతూ వచ్చి నుంచున్నాడు.

"ముత్యాలు కిచ్చిన రాయెక్కడ దొరికిందయ్యా" అనడిగాడు నాయుడు.

సిద్ధయ్య కళ్ళనీళ్ళయిపోయి అన్నాడు.

"నా అర యెకరం చెక్కలోదేనయ్యా, తప్పయిపోయింది దొరా! ఏదో మెరుస్తున్న రాయిగదా అని ఏరుకొచ్చా. ఆయన అబ్బురంగా చూస్తుంటే ఇచ్చినానయ్యా! నేనడిగింది ఒక్క పొగాక్కాడే నయ్యా! ఆయనే పట్టెడిచ్చిండు. తప్పు నాదేనయ్యా" అంటూ సాగిలపడ్డాడు.

నీ పొలమెక్కడో చూపించమన్నారు సర్దారులు. సిద్ధయ్య దోవ చూపించగా ఆ అర ఎకరం చెక్కలో ఉన్న రాళ్ళనబడే రత్నాల్ని బస్తాలకెత్తి తిరుగు ప్రయాణం అయ్యారు.

సిద్ధయ్యని పిలిచి నాయుడు అడిగాడు. "నీకేం కావాలి" అని.

"నాకేం వొద్దు దొరా" అన్నాడు సిద్ధయ్య. పొలంలో పంట పాడయిందని అతని బాధ.

నాయుడు నవ్వుతూ "నీకు పదెకరాల మాన్యం, బండెడు పొగాకు ఇస్తున్నాను." అని వెళ్ళిపోయాడు.

సిద్ధయ్య తన అదృష్టానికి పొంగి తబ్బిబ్బైనాడు. ఆ తర్వాత జీవితమంతా కమ్మగా తిన్నాడు. పదిమందికి పెట్టాడు హాయిగా చుట్టకాల్చుకుంటూ.

"ఏందబ్బా! ఈ పిచ్చిమారాజులు! రాళ్ళు కొనుక్కుంటారేటి?" అని చచ్చిపోయేదాకా ఆశ్చర్యపడ్డాడు. తృప్తిగా వెళ్ళిపోయాడు.

ఆ తృప్తి, ఆ శాంతి నాయుడుకి, ముత్యాలుకి దొరకలేదు.*